క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించాలి

నియోజకవర్గ ఈఆర్‌ఓ సుబ్బారావు



గొల్లప్రోలు నగర పంచాయతీలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ సుబ్బారావు

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో పోలింగ్ నిర్వహించడానికి నిర్ణయించి ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లను సంబంధిత ఎన్నికల సిబ్బంది పర్యవేక్షించాలని నియోజకవర్గ ఈఆర్‌ఓ సుబ్బారావు సూచించారు. ఆయన శనివారం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలో పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. దుర్గాడ ఎంపీపీ హెచ్ పేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, సూపర్ వైజర్లు ఎస్.జానకి, వల్లీప్రియ, కె.ఈశ్వరరావు పలువురు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

కొత్తపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బారావు అన్నారు. మండలంలో శనివారం గోర్స, వాకతిప్ప, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదును ఆయన పరిశీలించారు. ఓటు నమోదులో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టనున్నట్టు తెలిపారు. మండలంలో ఉన్న 70 పోలింగ్ కేంద్రాల వద్ద రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దారు ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు సంతోషకుమారి

సామర్లకోట: బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జంగం సంతోషకుమారి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలల హక్కులు-పరిరక్షణ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసులో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం బాలికలకు అన్ని రంగాల్లోనూ అనేక రకాలుగా గౌరవం ఇస్తుందని చెప్పారు. బాలికలు తమ గౌరవానికి భంగం కలిగితే 1098 ట్రోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శివరామకృష్ణయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.వాణిప్రభ, కౌన్సిలర్ పాలిక కుసుమచంటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



సామర్లకోట సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఆవాల రాజేశ్వరి తదితరులు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చంద్రశేఖరస్వామి ఆలయ సమీపంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి ప్రారంభించారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేసినట్లు వార్డు కౌన్సిలర్ జట్ల మోహన్ తెలిపారు. ఆలయ కమిటీ నాయకులు అశపు సూకరాజు, అల్లంపల్లి శ్రీనివాస్, ఎం.అమ్మిరాజు, శెట్టిబత్తుల దుర్గారావు భక్తులకు సేవలందించారు. బలుసులపేటలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ప్రారంభించగా హిందూ ధర్మ రక్ష సమితి నాయకులు మార్ని రాంబాబు, జీవీకే మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విన్నకోట సురేష్ తెలిపారు. బీపీ, షుగర్ ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 98664 11346 సెల్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

కాకినాడ లీగల్: వచ్చే నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎక్సైజ్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కార్తిక మాసోత్సవాలకు సమాయత్తం

- పాదగయ క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు
- కొత్తనీటితో కళకళలాడనున్న పుష్కరిణి



పాదగయ క్షేత్రం

పిఠాపురం: పవిత్ర కార్తికమాసం ప్రారంభం కానుండడంతో అదీ శివునికి ప్రీతిపాత్రమైన కార్తికమాసం కావడంతో శైవ క్షేత్రమైన స్థానిక పాదగయలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు ప్రత్యేక అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాల కోసం పాదగయకు తరలి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పుష్కరిణిలో పాత నీరు తొలగించిన అధికారులు కొత్తనీటితో నింపుతున్నారు. స్నానాల అనంతరం భక్తులు పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతుంటారు. ప్రత్యేక పూజలకు వీలుగా ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కళ్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. స్వామి వారికి నిత్యం లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరిస్తున్నారు.

దూర ప్రాంత భక్తులకు ఆన్‌లైన్‌లో పూజలు

ఈ క్షేత్రంలో పూజలు చేయించుకోవాలనుకునే దూర ప్రాంతం భక్తులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ పూజలకు టిక్కెట్టు తీసుకున్న వారి పేరున వారు కోరుకున్న రోజున పూజలు చేసి ప్రసాదాలను పోస్టు ద్వారా పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. సోమవారాల వంటి ముఖ్య రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది వచ్చిన 2 లక్షల మంది కంటే ఈ ఏడాది ఎక్కువగా వస్తారని భావిస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఈఓ, పాదగయ క్షేత్రం, పిఠాపురం

గడప గడపలో అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



రాపర్తిలో స్థానిక లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలం రాపర్తిలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రజలకే నేరుగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రతి గ్రామంలోను మౌలిక సదుపాయాలు కల్పించడానికి నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుని ఇంకా ఏమి కావాలో అడిగి వెంటనే వాటిని సమకూర్చడానికి గడప గడపకూ మన ప్రభుత్వం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఇప్పటికే మంచి ఫలితాలు సాధించిందన్నారు. ఏ ఒక్కరికీ లేదనకుండా ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, కొత్తపల్లి రమణ బాబ్జీ, వులవల భూషణం, జవ్వాది కృష్ణమాధవరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పాత కేసుల విచారణ వెంటనే పూర్తి చేయాలి

డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్



గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం: 2020కి ముందు విచారణలో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన చార్జిషట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పిఠాపురం రూరల్, గొల్లప్రోలు పోలీసు స్టేషన్లను ఆయన శనివారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2020కి ముందు విచారణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, హత్యానేరం, పోక్సో చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. చీటింగ్, భూ సంబంధిత కేసులలో సంబంధిత అధికారుల విచారణ నివేదికను 91 సీఆర్‌పీసీ ప్రకారం విధిగా తీసుకుని త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. పగలు, రాత్రి వేళల్లో దొంగతనాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు అవగాహన పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అమలు చేస్తున్న వారధి కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఏఎస్పీ పి.శ్రీనివాస్, కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు ఎస్సైలు గుణశేఖర్, వినయ్‌ప్రతాప్ తదితరులు ఉన్నారు. తొలుత డీఐజీ పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉప్పుటేరు కోతతో ఆందోళన



కోతకు గురయిన తమ్మయ్యపేట రోడ్డు



కోతకు గురయి ఉప్పుటేరులో కూలిపోయిన రోడ్డు

- కోరేస్తున్న తమ్మయ్యపేట రహదారి
- సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

కొత్తపల్లి: అమరవిల్లి శివారు తమ్మయ్యపేట ప్రధాన రహదారి ఉప్పుటేరు ఉధృతికి పూర్తిగా కోతకు గురైంది. ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డు నుంచి రామన్నపాలెం వంతెన సమీపంలో ఉప్పుటేరును ఆనుకుని ఉన్న తమ్మయ్యపేట రహదారి పూర్తిగా కోతకు గురికావడంతో సీసీ రోడ్డు కూలిపోయింది. ఈ గ్రామం పూర్తిగా ఉప్పుటేరును ఆనుకుని ఉంది. ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డుతో పాటు గ్రామం కూడా కోతకు గురికావడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో నివశించే సుమారు 60 మత్స్యకార కుటుంబాలకు వేటే ఆధారం. కోతకు గురైన రహదారి కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సురక్షతో మెరుగైన వైద్యం



సామర్లకోట శిబిరంలో మందుల కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తదితరులు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అందరికీ మెరుగైన వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక బలుసులపేటలోని తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడానికి ప్రతి వార్డులోనూ వలంటీర్లు, హెల్త్ సిబ్బందితో సర్వే చేయించారన్నారు. ఆయా కుటుంబాల్లో అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో వైద్యం చేయిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 412 మందికి వైద్య సేవలందించి అవసరమైనవారికి మందుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్లు గంగిరెడ్డి కృష్ణమూర్తి, లక్ష్మీసత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం తాండ్ర శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



తుని రోటరీక్లబ్‌లో పెయింటింగ్స్ వేస్తున్న విద్యార్థులు

తుని: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే యువజనోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొని బొమ్మలు వేసారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు క్లబ్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు సీహెచ్ లోవరాజు జడ్జిగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, యూత్ యాక్టివిటీస్ చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు సీహెచ్ మంగరాజు, బ్రహ్మలింగేశ్వరరావు, ఎస్. వీర్రాజు, ఎస్.సాయిబాబా, పి.సుబ్రహ్మణ్యం, సరస్వతి సేవా సమితి ప్రతినిధి శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాణాలకు పాతర



గోతిలో నాసిరకంగా వేసిన కంకర



పెచ్చులుగా ఊడిపోతున్న కంకర

కొత్తపల్లి: పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రను పోషిస్తున్నారు. కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకటరాయపురంలో లక్షలాది రూపాయలతో సీసీ డ్రైన్ నిర్మిస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైన్ నిర్మాణంలో గోతులను తవ్వకుండానే పైపైన గ్రావెల్‌వేసి పాడిపాడిగా వేస్తున్నారంటూ వారు అంటున్నారు. నిర్మాణంలో ఉండగానే కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

వైభవంగా పడిపూజ



కోటి బిల్వార్చనకు హాజరైన అయ్యప్ప మాలధారణ భక్తులు, (అంతర చిత్రం) ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా గల స్థలంలో శుక్రవారం రాత్రి కోటి బిల్వార్చన, పడిపూజ వైభవంగా జరిగాయి. తుని, పాయకరావు పేట అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలకు కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, విశాఖపట్నం జిల్లాల నుంచి వేలాది మంది అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కేరళ చెండై వాయిద్యకారుల బృందం

దీపావళి సామగ్రి విక్రయాలకు స్థల పరిశీలన



గోకవరం సంత మార్కెట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోకవరం: దీపావళిని పురస్కరించుకుని మందుగుండు సామగ్రి అమ్మకాలకు అనువైన స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. స్థానిక సంత మార్కెట్లో స్థలాన్ని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఫైర్ ఎస్సై ఆర్.గోవింద, గోకవరం ఎస్సై యువి శివనాగబాబు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మందుగుండు సామగ్రి అమ్మకాలు చేపట్టే ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వరసాల ప్రసాద్, పులపర్తి బుజ్జి, వ్యాపారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పారాయణ



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు పారాయణ పఠించారు. స్థానిక మార్కెట్ వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితా సహస్ర పారాయణాలు చేశారు. అనంతరం దుర్గాదేవి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, ఉడతల రమణారావు, సంఘ మహిళా సభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

200 మందికి గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

తుని రూరల్: మండలంలోని తేటగుంటలో 200 మంది అర్హులకు శనివారం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. సర్పంచ్ అత్తి నాగరాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పేరూరి బద్రినారాయణ, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజబాబు రాజు, వీరబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ సర్వీసులు

- కాకినాడ డిపో మేనేజర్ మనోహర్



డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ స్థానిక డిపో మేనేజర్ ఎంవీఎస్ మనోహర్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18, 19, 25,26, డిసెంబర్ 2, 3, 9,10 తేదీల్లో ఈ బస్సులు నడుస్తాయన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామక్షేత్రాలన్నింటినీ దర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా తేదీల్లో ప్రత్యేక బస్సులు రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి పంచారామ క్షేత్రాల దర్శనం అనంతరం మరుసటి రోజు రాత్రి 8 గంటలకు కాకినాడ చేరుకుంటాయన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌కు రూ.860, అల్ట్రా డీలక్స్‌కు 1060, సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.1100 చొప్పున బస్ చార్జీలు నిర్ణయించామన్నారు. బస్సును పూర్తిగా కావాలనుకుంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే శ్రీశైలం క్షేత్రం దర్శనాని, శబరిమలైకి కూడా అద్దె ప్రాతిపదికన కానీ, టిక్కెట్ ప్రాతిపదికన కానీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాలకు 73829 10658, 73829 10778, 73829 10869 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



యోగా ప్రదర్శనలో యశ్వంత్

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న కిలారి యశ్వంత్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం శనివారం ఈ విషయం తెలిపారు. ఈ నెల 1 నుంచి మూడో తేదీ వరకూ పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో యశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడని వివరించారు. ఇతడు వచ్చే నెల త్రిపురలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. యశ్వంత్‌ను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అభినందించారు.

డ్రాఫ్ట్‌లో తప్పులుంటే సరిచూసుకోండి



గుడివాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ఓటరు జాబితా డ్రాఫ్ట్‌లో తప్పులుంటే సరిచూసుకునే అవకాశం ఉందని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. ఓటర్ జాబితా డ్రాఫ్ట్ ప్రక్రియలో భాగంగా శనివారం ఆయన మండలంలోని గుడివాడలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. డ్రాఫ్ట్‌లో తప్పులుంటే సరి చూసుకోవాలన్నారు. 5వ తేదీ ఆదివారం 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదు అవకాశం కల్పించామన్నారు. వచ్చే నెల 2, 3 తేదీల్లోనూ ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం చేపడతామని చెప్పారు. అనంతరం ఓటరు జాబితా డ్రాఫ్టును, పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, వీఆర్‌ఓ, సిబ్బంది ఉన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుని: దుర్గాడ – గొల్లప్రోలు రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. తుని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆ వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు, నలుపు రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఎరుపు రంగు కట్ బనియన్, నీలం రంగు జీన్ ప్యాంటు ఉన్నాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



మోటారు బైక్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై మండలపరిధిలోని చిన్నింపేట వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... వైజాగ్ నుంచి బెంగళూరు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రత్తిపాడు నుంచి యర్రవరం వైపు మోటారు బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలు ఎం.శ్రీనివాస్, నాగదేవిలను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ వాహనంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆటో దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగ్గంపేట: మండలంలోని వెంగాయ్యమ్మపురంలో మజ్జి దుర్గాప్రసాద్‌కు చెందిన ఆటో శనివారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... ఆటో డ్రైవర్, యజమాని దుర్గాప్రసాద్ ఉదయం వెంగాయమ్మపురం నుంచి జగ్గంపేట వచ్చేందుకు ఆటోను బస్టాండ్ వద్ద పార్కింగ్ చేశారు. బయలు దేరడానికి ఆటో స్టార్ట్ చేయగా బ్యాటరీ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికుల సహాయంతో ఆటోను పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి తోసి జగ్గంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.1.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తెలిపారు.